
# మనీష

రాయపెద్ది వివేకానంద





బాగా చలిగా ఉంది.

సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉన్న పర్వత పంక్తులు కావటం వల్లనేమో, మంచుతెరలు దట్టంగా అలుముకుని ఉన్నాయి. ఆ ఘాట్‌రూట్‌లో బస్సు నడపటం చాలా కష్టమయిన పనే అయినా, అనుభవం వల్ల కాబోలు డ్రైవర్ సునాయాసంగా ముందు కురికిస్తున్నాడు. నీరెండలో తారు రోడ్డు పైని తడి పాదరసంలా మెరుస్తోంది.

అందంగా కనిపిస్తున్న ప్రకృతి విశ్వరూపాన్ని తన్మయంగా చూస్తున్నాడు సందీప్. కొండపై నుండి క్రిందకు దిగుతూండటం వల్ల బస్సు వేగంగానే వెడుతోంది. ఇదే వేగంతో వెళితే మరో పదిహేను నిముషాల్లో కొండ కింద సుదూరంగా కనిపిస్తున్న ఆ పల్లె వచ్చేస్తుంది. పెండ్లిమర్రి ఆ పల్లె పేరు. సందీప్ వెళుతోంది అక్కడికే. ఓ

ప్రముఖ గ్రానైట్స్ కంపెనీలో చీఫ్ జియాలజిస్టు అతను. నేల రకాన్ని బట్టి అక్కడి రాతి విలువయిందే, కాదో తెలుసుకోవటం, విలువయిందే అయితే ఆ ప్రాంతంలో అది ఎంతమేరకు లభ్యమవుతుందో పరిశోధించటం, ఆపై సర్వే రిపోర్ట్స్ పై ఆఫీసుకు పంపటం అతడి విధులు. 'ఆఁ అక్కడేముంది రాళ్లూ రప్పలూ' అని చప్పరించేవారు, అదే రాయి కోట్లు ఆర్జించి పెట్టగలదని తెలిస్తే, గుడ్లు తేలేస్తారు. కాకపోతే ఆ రాయి గ్రానైట్ అని నిర్ధారణ కావాలి, అప్పుడు బంగారు పంట పండినట్టే లెక్క.

పెండ్లిమర్రిలో గ్రానైట్ లభిస్తుందో, లేదో తెలుసుకోవటానికే ఇప్పు డతని ప్రయాణం. ఇంకా నలుగురు బొంబాయి నుండి రావాలి. పెండ్లిమర్రిలో వసతి, అదీ చూసుంచటానికి ముందే బయల్దేరాడు సందీప్.

నీరెండలో అప్పుడప్పుడే విడిపడుతున్న మంచుతెరల మాటు నుండి పెండ్లిమర్రి స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది. పల్లె చలికి ముసుగదీసుకుని పడుకున్నట్టుగా అనుభూతి కలుగుతోంది. ఆ ఊరికి వెళ్లటం అదే మొదటిసారి సందీప్‌కు. అంత చిన్న ఊర్లో లాడ్జిలు కాదు కదా కనీసం కాఫీ హోటలయినా ఉంటుందా అన్నది అనుమానమే. అందుకే బయల్దేరే ముందే వాకబు చేస్తే తెలిసింది, ఆ ఊర్లో డాక్టర్ అనుపమా ఛటర్జీ అనే ఆవిడ ఉంటుందని, ఆవిడ ఆర్మీ డాక్టర్‌గా ఉండి రిటైరయ్యిందని. ఇంకేం, ఆర్మీలోనే ఉండి రిటరయిన తన బాబాయ్‌ని కలిసి విచారించాడు సందీప్. ఆవిడ ఆయనకు తెలుసట. ఆయనే ఫోన్‌కాల్ బుక్ చేసి, సందీప్ వస్తున్న విషయం ఆవిడకు తెలిపాడు. ఆమె, సందీప్ రాక తమ కేవిధంగానూ ఇబ్బంది కాబోదని, పెపెచ్చు ఆ పల్లెలో సందీప్ వల్ల తమకూ కాలక్షేపం అవుతుందనీ, సందీప్‌ని ఎటువంటి మొహమాటం లేకుండా వచ్చేయమనీ ఆహ్వానించింది.

బస్సాగింది. "పెండ్లిమర్రి వచ్చింది సార్!" కండక్టర్ సాధికారికంగా ప్రకటించాడు. లగేజ్ తీసుకుని దిగాడు సందీప్. ఆ ఊర్లో దిగింది అత డొక్కడే. ఎక్కేవారు అసలు లేరు. బస్సు వెళ్లిపోయింది చిన్నగా శబ్దం చేసుకుంటూ.

అత డూహించిన దానికన్నా చాలా చిన్నది ఊరు. అక్క డొకటి అక్క డొకటీ విసిరేసినట్టుగా ఉన్నాయి ఇళ్లు. కానీ అన్నీ కూడా ఆధునికంగా ఉండటం గమనించాడు. "ఎండాకాలంలో నగరాల నుండి చాలా మంది వస్తుంటారు విడిది చేయటానికి. అందుకే అన్ని ఇండ్లు గెస్ట్ హవుస్‌లా ఆధునికంగా తీర్చిదిద్దుంటారు అనుకున్నాడు సందీప్.

దారిలో కనిపించిన ఒకరిద్దర్ని అడిగి కనుక్కుని గమ్యం చేరాడు. "పెద్ద ఇల్లే" - గేట్ తీసుకుని కాంపౌండ్‌లో మొక్కల మధ్య నడుస్తూ అనుకున్నాడు.

కాలింగ్ బెల్ చప్పుడు విని వెళ్లి తలుపు తీసింది మనీష. ఆమె వయసు పదహారుకు పదిహేడుకు మధ్య ఉండవచ్చు. లేలేత యవ్వనానికి పసిమిఛాయ మరింత ఆకర్షణ



## స్వంత తల

ఒక ఉపన్యాసంలో ఒక ఉపన్యాసకుడు అర్థరహితంగా మాట్లాడుతున్నాడు. అంతేగాక, భరించలేనంత బిగ్గరగా ఉపన్యసిస్తున్నాడు. ఆ సమావేశంలో పాల్గొన్న చర్చిల్ తలను అడ్డంగా అమిత వేగంతో ఊపసాగాడు. అది చూసిన ఉపన్యాసకునికి చర్చిల్‌పై కోపం వచ్చింది.

"నేను నా స్వంత అభిప్రాయాలను మాత్రమే చెబుతున్నాను. ఈ విషయాన్ని చర్చిల్ గారు గమనించాలి!" అన్నాడు.

అందుకు చర్చిల్ : "నేను నా స్వంత తలను మాత్రమే ఊపుతున్నాను. ఉపన్యాసకులవారు అది గమనించాలి!" అన్నాడు.

దానితో సభంతా ఒక్కసారిగా నవ్వింది.

సేకరణ : పి.వి. రమణకుమార్
[చిలకలూరిపేట]

చేకూరుస్తోంది. విశాలమైన అల్చిప్పల్లాంటి కళ్లల్లో తళుక్కున మెరిసి మురిపించే స్నిగ్ధత ఎదుటివారిని ఆకట్టుకుంటుంది. కొనదేలిన నూటి ముక్కు కింద ఎర్రటి పెదాలు మంచులో తడిసిన లేత గులాబి రెక్కల్లా ఉన్నాయి.

"ఎవరండీ?" పల్చటి పెదాలు విడీ విడనట్టు నవ్వి ప్రశ్నించింది, మనీష.

చేష్టలుడిగి ఆమెనే చూస్తుండిపోయాడు సందీప్. ఆసిడ్ వాష్ బ్యాగీ ప్యాంటుపై గచ్చకాయ రంగు టీ షర్ట్ వేసుకున్న ఆ ఆగంతకుడు ఎవరయిందీ అర్థమవలేదు మనీషకి. ఏవో కొంప లంటుకుపోయినట్టు ఆగకుండా కాలింగ్ బెల్ నొక్కి తీరా తలుపు తెరిచాక ఏం పలక్కుండా నిలబడిపోయాడు. అతడిని అంత విభ్రాంతికి గురిచేసింది తన అందమేనన్న విషయం తెలియని అమాయకురాలేం కాదు మనీష.

"హలో! ఎవరండీ బాబూ అంటే పలకరేం?" ఈసారి కాస్త గట్టిగా అడిగింది.

అప్పుడు తెప్పరిల్లా డతను. తమ మధ్య సామీప్యాన్ని గుర్తించి ఒకడుగు వెనక్కు వేశాడు తడబడుతూ. సూట్‌కేసుల్ని నేలపై ఉంచి, అడ్రసు కాగితాన్ని మరోసారి పరికించి "డాక్టర్ అనుపమ ఛటర్జీ గారి ఇల్లిదేనాండీ" ప్రశ్నించాడు.

"అవును ఇదే. ఆమె మా పెద్దమ్మ." అతన్నే పరిశీలనగా చూస్తూ చెప్పింది మనీష.

"థాంక్ గాడ్!" ఇల్లు తేలిగ్గా దొరికినందుకు నిట్టూర్చా డతను.

మధ్యలో 'గాడ్' కెందుకు థాంక్స్ అన్నట్టు చూసి అంది మనీష.

"ఈ పల్లెలో ఇల్లు కనుక్కోటం సులభమే లెండి, ఇంతకూ మీరు...." అర్ధోక్తిలో ఆగిపోయింది.

"నేను హైదరాబాద్ నుండి వస్తున్నాను. అయాం సందీప్."

"ఓ! మీరా. ఇప్పుడు గుర్తొచ్చింది వారం క్రితం మీ రొస్తున్నట్టు ఫోన్ కాలొచ్చింది. రండి, రండి, నా తెలివి తెల్లారినట్టే ఉంది మిమ్మల్ని బయటే నిలబెట్టి మాట్లాడేస్తున్నాను, లోపలకు రండి. మా పెద్దమ్మ ఇందాకే గుడి కెళ్లింది, వెళ్లేముందు కూడా గుర్తు చేసుకుంది మీ రొచ్చేది ఈవేళేనని, రండి ప్లీజ్ కమిన్!" పోనీటెయిల్ తమాషాగా కదిలిస్తూ లోనికి నడిచింది ఆ అమ్మాయి.

'ఈ అమ్మాయి చాలా చురుగ్గా ఉందే' అనుకుని, ఆమె వెంబడే లోనికి దారి తీశాడు సందీప్.

ముందు గది అంత విశాలంగా లేకపోయినా ఆధునికంగా ఉంది. గోడలపై అందమైన సీనరీ లున్న పెయింటింగ్స్, కార్పెట్స్, షాండ్లెయిర్స్ గృహిణి అభిరుచిని తెలుపుతున్నాయ్.

"కూర్చోండి."

సూట్‌కేసులు రెండింటినీ, ఎయిర్ బ్యాగ్‌నీ గోడవారగా ఉంచి సోఫాలో కూలబడ్డాడు. పక్కనే ఉన్న కిటికీలోనుండి దూరంగా ఉన్న సెలయేరు, ఎత్తైన శిఖరాలు అద్భుతంగా కనిపిస్తున్నాయి.

"మీరు టీ తాగుతారా, కాఫీనా?" లోని గదిలోకి వెళ్తూ ప్రశ్నించింది, అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా.

"టీనే తాగండి. ఎందుకంటారా. అయాం ఏన్ ఎక్స్‌పర్ట్ అట్ మేకింగ్ లెమన్ టీ." ప్రకటించినట్టు చెప్పింది.

"అలాగే! మీ ఇష్టం ఏదయినా సరే. అన్నట్టు మీ పేరు చెప్పనే లేదు."

"మనీష." చెప్పేసి తూనిగలా వంటింట్లోకి వెళ్లిపోయింది.

'మనీష, స్వీట్ నేమ్.' అనుకున్నాడు సందీప్.

'హైదరాబాద్‌లో బాబాయ్ చెప్పిన ప్రకారమయితే ఈ ఇంట్లో కేవలం డాక్టర్ అనుపమ ఛటర్జీ, ఆవిడ భర్త మాత్రమే ఉంటారు. మరి ఈ అమ్మా యెవరబ్బా అనుకున్నాడు సందీప్.

లోపలి నుండి గిన్నెల చప్పుడు వినిపిస్తూంది. తటిల్లతలా అటూ ఇటూ కదుల్తూ టీ కలుపుతున్న మనీషనే చూస్తున్నాడు సందీప్.

"నీలమేఘ శరీర నిత్యానందం దేహి

"బాలా.... గోపాలకృష్ణా పాహి పాహి" చిన్నగా హం చేస్తూ ఉంది మనీష.

నవ్వొచ్చింది సందీప్‌కు. పోనీటెయిల్, మోడర్న్ ఫ్యాషన్ డ్రస్సు, నెయిల్ పాలిష్, గోడపై స్టీవీవాండర్ ఫోటో, నోటిలో మాత్రం నారాయణ తీర్థుల వారి తరంగం - ఇవి పరస్పర విరుద్ధంగా తోచి నవ్వుకుంటూ ఉండిపోయాడు.

"టీ తీసుకోండి." అకస్మాత్తుగా వినవచ్చిన పిలుపుకి ఉలిక్కిపడి తలెత్తి చూసి, 'థాంక్సం'టూ టీ అందుకున్నాడు. ఆమె కూడా మరో కప్పులో తెచ్చుకున్న టీ తాగుతూ ఎదురు సోఫాలో కూర్చుంది.

"నిజంగా చాలా బాగాచేశారు." ప్రశంసాపూర్వకంగా చెప్పాడు.

ఆమె చిన్నగా తలపంకించింది. కాసేపు అదీ

ఇదీ మాట్లాడుకుంటుండిపోయారు.

"మీ రీ ఊరికి మొదటిసారా రావటం?" మాటల మధ్యలో ప్రశ్నించింది.

"అవును" చెప్పాడు.

"ఇక్కడ చాలా బాగుంటుంది కదూ! రియల్లీ వండ్రఫుల్" అంది మనీష.

"నేను బస్సులో నుంచి చూస్తూ సరిగ్గా అదే అనుకున్నాను. నా కిక్కడ పని బహుశా వార ముండొచ్చు కానీ నేను పైన మరో మూడ్రోజులన్నా ఆగి అన్నీ చూసి ఫోటోలు కూడా తీసుకువెళదాం అనుకుంటున్నా." చెప్పాడు సందీప్.

"మంచి ఆలోచన! నాకూ అన్నీ చూడాలనే ఉన్నా ఎవరూ తోడులేక ఆగిపోయాను. మీతోపాటు నేనూ చూడొచ్చు. థాంక్స్ ఫర్ యువర్ అయిడియా."

"అంటే మీరూ ఈ ఊరికి కొత్తనే నన్నమాట."

"అవును."

"అంటే మీ రెక్కడ ఉండటం?"

"నేటివ్ ఆంధ్రానే, కానీ అమ్మా, నాన్నా నేనూ పూనాలో ఉంటున్నాం. నే నక్కడ ఎంబిఏ చేస్తున్నాను."

"వెరీ గుడ్! అయితే సరదాగా పెద్దమ్మా, పెద్దనాన్న గార్లను చూట్టానికి వచ్చారన్నమాట. అన్నట్టు మీ రొచ్చి ఎన్ని రోజు లవుతోంది?"

అతడి ప్రశ్న పూర్తి కాకముందే ఆమె వదనంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విశాలమయిన ఆ కండ్లు క్షణాల్లో నీటితో నిండాయి. కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది మనీష.

త నన్నదాంట్లో తప్పేముందో అర్థమవలేదు సందీప్‌కు. ఎందుకు మనీష కన్నీరు పెట్టుకుంది. ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నాడు. గుడికెవెళ్ళిన అనుపమ ఛటర్జీ ఇంకా రానేలేదు, కనీసం ఆవిడ వచ్చినా బావుణ్ణు. వద్దు వద్దు ఆమె ఇప్పు డొచ్చిందంటే ఈ కన్నీళ్ళు అదీ చూసి తనను మరోలా భావించి బయటకు గెంటినా గెంటివేయగలదు. మనీషనే చూస్తూ కూర్చున్నాడు.

"అయాం సారీ!" దుఃఖం నుండి తనకు తానే బయటపడి చెప్పింది మనీష. "నే నొచ్చి ఎన్నాళ్ళయిందని కదూ అడిగారు - రెండు వారా లవుతోంది."

"అది సరే, మీ రెందుకు సడెన్‌గా అప్‌సెట్టయ్యారు?"

"నథింగ్ సందీప్. నథింగ్." ఇదివరకటి జీవకళ లే దా కంఠంలో.

"నే నేమయినా తప్పుగా మాట్లాడానా, మనీషా?"

"నో అలాంటిదేం లేదు."

"మరెందుకు అలా అయిపోయారు ఉన్నట్టుండి?"

"ఏం లేదన్నానా?"

"లేదు. మీ రేదో దాస్తున్నారు మనీషా! నా ప్రశ్నలో విషాదాన్ని కలిగించే ప్రస్తావన లేవీ లేవు. అయినా ఎందుకో మీరు చాలా బాధపడుతున్నారు ఏదో విషయం గుర్చి. అదేమిటో చెప్పాలి."

"మీ కీ ఊర్లో మరెవ్వరూ తెలీదా సందీప్?" తనే ఎదురు ప్రశ్నించింది మనీష. అయినా చాలా అసంబద్ధంగా ఉం దా ప్రశ్న.

అదే భావాన్ని మొహంలో చూపుతూ "ఎవ్వరూ తెలీదు, అయినా..." మధ్యలో ఈ ప్రశ్నేమిటి అన్నట్టు ఆగిపోయాడు.

"అంటే ఇక్కడ జరిగే విషయాలేవీ మీకు తెలిసే అవకాశం లేదన్నమాట."

"అంతేకదా."

"అందుకే సందీప్! మా పెదనాన్న బ్రతికే ఉన్నారని మీరు భావిస్తున్నారు."

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు సందీప్.

"అంటే... అంటే...?"

"ఎస్! సందీప్, మా పెదనాన్న లేరు చనిపోయారు." కాసేపాగి అంది "ఆ తలుపు వంక చూడండి." అంతదాకా గమనించనేలేదు సందీప్ తూర్పు వైపునున్న ఆ తలుపుని. బార్లా తెరిచి ఉంది. ఆ తలుపు దాటితే కాంపౌండులోకి వెళ్లవచ్చు. అలాగే నడుస్తూ వెళ్తే, కాంపౌండ్ వాల్‌లా ఉన్న పూలతీగలు తగులుతాయి. ఆ తర్వాత ఉన్న కాలిబాట నేరుగా క్రింద ఉన్న లోయలోకి దారితీస్తోంది ఏటవాలుగా.

"మీ పెదనాన్నగారు చనిపోవటానికీ, ఆ తలుపు బార్ల తెరిచి ఉంచటానికీ, మీ దుఃఖానికి సంబంధముందా మనీషా?"

అవునన్నట్టు నిశ్శబ్దంగా తలూపింది మనీష.

"అయినా మీ పెదనాన్న చనిపోయిన విషయం మా బాబాయికి తెలియాలిగా! ఎందుకు తెలియదు?"

"మీ బాబాయ్ ఇక్కడి వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఎన్నాళ్లయుంటుంది?" అడిగింది మనీష.

"మొన్నటి ఫోన్ కాల్ మినహాయిస్తే...... దాదాపు నాలుగేండ్లు."



రిషీ తిరస్కార పాత్ర

'రాజా'లో నానా పటేకర్ మధ్యలో వదిలేసి వెళ్లిన హీరో అన్న పాత్ర కోసం రిషీకపూర్ వద్దకు వెళ్లారు అనిల్ సోదరుడు బోనీ, దర్శకుడు ఇంద్ర కుమార్. నానా పాత్ర విశిష్టతను వారు వివరిస్తుం డగా... "మరి అంత మంచిపాత్ర సంజయ్ సొంత సోదరుడు అనిల్‌కే ఇవ్వొచ్చు కదా ? నా దగ్గరకు ఎందుకు వచ్చారు?" అంటూ చురక తగిలించా డట రిషీ. కథ అర్థం తిరిగేసరికి చేసేదేమీలేక పరేష్ రావల్‌ను ఆ పాత్రకు తీసుకున్నారు ! చిత్రంలోని అన్ని పాత్రలూ మాధురి ముందు తోలుబొమ్మ లేనట ! మరి ఎవరైనా తిరస్కరి స్తారు !

మసూద్ అన్సారి

"అందుకే మీ బాబాయ్‌కి తెలియదు, మా పెదనాన్న పోయి మూడేండ్లు మాత్రమే అవుతోంది."

"ఓ! అయాం సారీ." ఇంకేమన్లేక కిటికీ వంక కదిలాడు సందీప్. అయినా ఆ తలుపు బార్లా ఎందుకు తెరిచి ఉంది అన్న విషయం అతడికి అంతుబట్టడంలేదు.

కాసేపటికి మౌనం తర్వాత అదే విషయం అడిగాడు మనీషని.

"మా పెదనాన్నగారికి చాలా ఇష్టమయిన హాబి ఫిషింగ్... చేపలు పట్టడం." ఆగిపోయింది మనీష.

ఆమె చెప్పబోయే విషయానికి అది ఉపోద్ఘాతంగా అర్థమయి, వింటున్నట్టు తల పంకించాడు ఆమెనే చూస్తూ.

చెప్పటం ప్రారంభించింది మనీష.

"చేపలు పట్టడం కోసం ఆయన ఈ తలుపు గుండానే వెళ్లేవారు. ఆయన్తో పాటు మా పెద్దమ్మ తమ్ముళ్ళిద్దరూ, టామీ కూడా ఉండేవా రెప్పుడూ. ఆదివారం ఉదయమనగా వెళ్లి చీకటి పడేటప్పుడు వచ్చేవారు. ఆ రాత్రంతా చేపలు పట్టడంలో ఎదురయిన అనుభవాల్ని నవ్విస్తూ చెప్పేవారు ముగ్గురూ. అదొక సంబరంగా ఉండేది. వెళ్లటం, రావటం - అంతా ఈ తూర్పు వైపు తలుపుగుండానే జరిగేది.

"ఒకసారి ఇలాగే డిసెంబరు మాసం. ఎప్పట్లాగే ఆదివారం ఉదయం ముగ్గురూ లేచి బయల్దేరి వెళ్లారు. సాయంత్రం రాగానే, అల్లంతదూరం నుండే పెదనాన్న పెద్దమ్మ నుద్దేశించి 'అన్నూ! ఈ వేళ్టి స్కోరు 150' అని ఎన్ని చేపలు దొరికాయో ప్రకటించేవారు. కావాల్సినవి ఉంచుకుని మిగతావి మార్కెట్‌కి ఉచితంగా ఇచ్చేవారు. ఆ సాయంత్రం చాలాసేపు ఎదురుచూశాం. ఎంతకూ రాలేదు. చూసి చూసి విసుగెత్తింది. చీకటి పడిపోయింది.

"అప్పు డొచ్చి చెప్పారెవరో, తిరిగివస్తూ దారిలో కుక్కపిల్ల టామీతో సహా అందరూ ఊబిలో చిక్కుకుపోయారని, ఆ చలిలో, చీకట్లో టార్చ్‌తో వెళ్లిచూశాం, లాభంలేకపోయింది. అప్పటికే అంతా అయిపోయింది. గింజుకుంటూ మా ముందరే నిస్సహాయంగా ఊబిలో మునిగిపోయారు. కనీసం శవాల్ని కూడా దక్కించుకోలేకపోయాం."

అంత విషాదకరమైన విషయాన్ని విధి ఆడిన విచిత్ర నాటకాన్ని దుఃఖంతో పూడుకుపోతున్న గొంతుకతో వివరిస్తుంది మనీష.

"పోయిన మనుషులు తిరిగిరారు. ఇది సత్యం! మనందరికీ తెలును. కానీ మా పెద్దమ్మే ఈ విషయంలో రాజీపడలేకపోతోంది. సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం, ఇదే తేదీన మరణించారు వాళ్ళు. ప్రతి సంవత్సరం ఈ తారీఖునాడు వాళ్లు తప్పక తిరిగి వస్తారని ఎదురుచూస్తుంది ఆమె. రాత్రి చీకటిపడేదాకా తూరుపు వైపు తలుపు వేయదు, నన్ను వేయనివ్వదు. ఈ రోజు కోసం సంవత్సరమంతా ఎదురుచూస్తుంది, ఎదురు చూసిన దినం రాగానే గుడికెళ్లి మధ్యాహ్నమంతా ప్రత్యేక పూజలు చేయిస్తుంది. సాయంత్రమంతా తలుపు ముందరే కూర్చుని ఎదురుచూస్తుంది."

చెప్పటం ముగించింది మనీష. విషాదంగా నవ్వుకున్నాడు. 'సరిగ్గా తద్దినం నాడు వచ్చిపడ్డాను, ఇదెక్కడి తద్దినంరా బాబూ అని మొదట అనుకున్నా వారున్న పరిస్థితి వల్ల నిజంగా బాధపడసాగాడు.

ఈలోగా తలుపు దగ్గర అలికిడి వినిపించింది. గుమ్మం దగ్గర సుమారు యాభై ఏండ్ల వయస్సున్న స్త్రీ నిలబడి ఉంది. ఆమె మొహం గంభీరంగా ఉంది. ఏదో పవిత్రత గోచరిస్తుం దా వదనంలో. ముందుగా తేరుకున్నది మనీషనే.

"రా పెద్దమ్మా! చాలా ఆలస్యమయిందే. మధ్యాహ్నమనగా వెళ్లి ఇప్పు డా రావటం, అప్పుడే ఆరయింది." ఎదురెళ్లి ఆమె చేతి నుండి పూలసజ్జ అందుకుంటూ పరామర్శించింది మనీష.

లేచి నిలబడి నమస్కరించాడు సందీప్. ప్రతినమస్కారం చేసి అతని పక్కనే వచ్చి కూర్చుంది, సందీప్ కూడా కూర్చున్నాడు.

"హైదరాబాద్ నుండేనా సందీప్‌గారూ? ప్రయాణం బాగా జరిగిందా? సరిగ్గా మీ రొచ్చే సమయానికి నే నింట్లో లేను ఏమనుకోకండి." నొచ్చుకుంది డాక్టర్ అనుపమ ఛటర్జీ.

"ఫర్వాలేదు లెండి, మనీష బాగా కంపెనీ ఇచ్చింది. అసలు కొత్త అనిపించలేదు. కానీ..." ఆగిపోయాడు.

"చెప్పండి సందీప్."

"అదే, మీరు పెద్దవారు నన్ను మీరు, మీరు అని మన్నించకండి."

"ఓ! అదా" నవ్వేసిం దావిడ. "మనీషా! కొన్ని టిఫిన్ తయారుచెయ్యమ్మా. ఇంకాసేపు అయ్యాక మీ పెదనాన్న మామయ్యలు వచ్చేస్తారు. రాగానే ఆకలి ఆకలి అంటూ చిందు లేస్తారు."

ఆమె వంక జాలిగా చూశాడు. పోయిన వ్యక్తులు రారు అని తెలిసినా ఆవిడ భ్రాంతిలో బతకడం జాలిగొల్పుతోంది. మనీష కూడా ఆవిణ్ణి జాలిగా చూస్తోంది. "టిఫిన్ సిద్ధంగా ఉంది పెద్దమ్మా."

ఆవిడ తలూపింది. ఆమె చూపంతా తెరచి ఉంచిన తూరుపు వైపు తలుపు పైనే ఉంది.

"మీ బాబాయ్ మేజర్ సుందరం ఎలా ఉన్నారు సందీప్?"

బావున్నారండి. మిమ్మల్ని అడిగినట్టు చెప్పమన్నారు."

"వెరీ కైండాఫ్ హిమ్."

పరస్పర కుశల ప్రశ్నలయ్యాక, బాత్రూంకెళ్లి రిఫ్రెష్ అయ్యొచ్చాడు సందీప్. మిగతా ఇద్దరూ ఇతని కొరకే ఎదురుచూస్తున్నారు. టిఫిన్ తింటున్నంతసేపు అనుపమ ఛటర్జీ ఫిషింగ్ కెళ్లిన మిస్టర్ ఛటర్జీ గూర్చే చెబుతోంది. ఆమె తమ్ముళ్లిద్దరూ ఎలాగుంటారు, ఏవి రకాల గాలాలు వాడగలరు, టామీకి చేపల్నింటికి తేవటంలో ఎలా శిక్షణ ఇచ్చింది వగైరా వైనాలన్నీ వివరిస్తోంది. ఆదివారం అయితే చాలు, పిడుగులు పడినా, ఎండ కాసినా ఛటర్జీని చేపలు పట్టకుండా ఎవ రావలేరట.

మనీష వంక చూశాడు. జాలిగా చూస్తోంది పెద్దమ్మ వంక. మనీష ముందరే చెప్పి ఉండటాన



## ప్రభుదేవాతో మాధురి

నంబర్ వన్ కిరీటాన్ని అందుకున్న మాధురీ దీక్షిత్, తన నాట్యంతో దక్షిణాదిని ఉర్రూత లూగిస్తున్న ప్రభుదేవాతో కలిసి ఒక చిత్రంలో నటించడానికి అంగీకారం తెలిపిందనే వార్త బాలీవుడ్‌లో సంచలనాన్ని సృష్టించింది. తమిళ్, హిందీ భాషలలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'బొంబాయి' ఛాయాగ్రాహక దర్శకుడు రాజీవ్ మీనన్ దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ప్రభుదేవాతో డాన్స్ చేయడమంటే మాటలా? మాధురి ఇప్పటి నుంచే ప్రాక్టీస్ మొదలుపెడితే బాగుంటుంది మరి !

మసూద్ అన్సారి

టాపిక్ డైవర్ట్ చేసి ఆమె నా మూడ్ నుండి బయటకు తెచ్చే ప్రయత్నం చేయసాగాడు సందీప్. గ్రానైట్ కంపెనీ పని గురించి, విదేశాల్లో గ్రానైట్ రాతి విలువ గూర్చి, మైనింగ్ గూర్చి చెబుతున్న సందీప్‌ని వినుగ్గా చూసి "అమ్మాయ్ మనీషా! తూర్పు వైపు లైటాన్ చెయ్, చీకటి పడుతోంది, వాళ్లొస్తే ఇబ్బందిలేకుండా ఉంటుంది లైటు వేసే ఉంచు."

ఈమెను ఆ భగవంతుడు కూడా మార్చలేడు. వినుగ్గా అనుకుని, యధాలాపంగా మనీష వంక చూశాడు.

మనీష చూపంతా తూరుపు వైపు తలుపుపైనే ఉంది. అసలే పెద్దవయిన ఆమె కళ్లు మరింత పెద్దవయ్యాయి. ఆ కళ్లలో భయం తాలూకు నీలి నీడలు స్పష్టాతిస్పష్టంగా కనిపిస్తున్నాయి. లేత పెదాలు భయంతో తడబడుతున్నాయి. ఆమె ఆపాదమస్తకం చిగురుటాకులా కంపిస్తోంది.

ఆమె దేనికంతగా భయపడుతుందో అస లర్థంకాలేదు సందీప్‌కి. అడవి నుండి ఏ నక్కో తోడేలో వచ్చి తలుపు ముందర కూర్చుంది కాబోలు అనుకుని, సోఫా నుండి లేచి రెం డడుగులు వేసి ఆమె పక్కన వెళ్లి నిలబడ్డాడు. ఇప్పుడు తూర్పు వాకిలి నుండి దృశ్యం అతడికి స్పష్టంగా కనిపిస్తోంది..

చిరుచీకటి ఆవరించి ఉంది బయటంతా. మంచు దట్టంగా అలుముకుని ఉండటం వల్ల దూరంగా సెలయేరు, పర్వతశిఖరాలు కనిపించటం లేదు. ఎటు చూసినా తెల్లటి మంచుపొగ. దీపం కాంతిలో, పూల తీగలపైని మంచుబిందువులు చిత్రంగా మెరుస్తూ ముత్యాల్లా కనిపిస్తున్నాయి. వీటిని కాదు సందీప్ చూస్తున్నది. లోయ నుండి ఏటవాలుగా పైకి సాగి ఉన్న కాలిబాట వెంబడి ఏవో మూడు ఆకారాలు నడిచి రావటం అస్పష్టంగా గోచరమవుతోంది. వారినే గమనిస్తున్నాడు సందీప్. మంచుతెరల్ని చీల్చుకుంటూ ముందుకే వస్తున్న ఆ ముగ్గురూ కాస్త స్పష్టంగా అగుపిస్తున్నారు ఇప్పుడు. వారి ముందర తోకాడించుకుంటూ కుక్కపిల్ల ఒకటి ఉంది. వాళ్లందరి చేతుల్లోనూ యూరోపియన్ ఫైప్ గాలాలు ఉన్నాయి. ముంద రతని చేతిలో వల కూడా ఒకటుంది, మరో చేతిలో ఐస్ బాస్కెట్ పెద్ద సైజుది ఉంది. అందరి దేహాలు, దుస్తులు, మాస్ బురదగొట్టుకుని ఉన్నాయి.

మనీష వంక చూశాడు. భయంతో వణికిపోతోంది. ఆమె పెదాలు అస్పష్టంగా పలికే 'పెదనాన్నా' అన్న పిలుపు సందీప్‌కి వినిపించింది. సరిగ్గా ఇదే సమయంలో, ఆ ముగ్గురిలో కాస్త ముం దున్నాయన బుట్టను గాల్లోకి ఊపుతూ "అన్నా ఈవేళ్టి స్కోరు 100" గట్టిగా అరిచాడు.

అంతే ! వాయువేగంతో వెనుదిరిగాడు సందీప్. సూట్‌కేసుల్నీ ఎయిర్ బ్యాగునీ ఎలా అందుకున్నాడో, అంత వేగంగా మాస్‌ని ఎలా తొడుక్కోగలిగాడో అతడికే తెలియదు. రైఫిల్ నుండి వెలువడిన బుల్లెట్‌లా పరుగందుకున్నాడు. రోడ్డుపై సైకిల్ మీద వెడుతున్న ఓ వ్యక్తి ఇంట్లోంచి అంత వేగంగా రోడ్డుపైకి దూసుకొచ్చిన సందీప్‌ని తప్పించే ప్రయత్నంలో సఫలీకృతుడు అయ్యాడుగానీ, అతనే చివరికి ఓ కాలువలో పడటం విషాదకరం. అయితే ఇదంతా పట్టించుకునే స్థితిలో లేడు సందీప్. బస్టాప్ దిశగా పరిగెడుతూనే ఉన్నాడు.

సమయం ఏడయింది. మంచు దూదిలా నింగి నుండి రాలుతూ ఉంది. బాగా చలిగా ఉంది. బస్టాపు దాదాపు నిర్మానుష్యంగా ఉంది. చెట్టు కింద బడ్డీ కొట్టులో వ్రేలాడుతున్న హరికెన్ లాంతరు వెలుగుపరచటానికి విఫలయత్నం చేస్తోంది.

పరుగు పరుగున వచ్చి చెట్టు కిందున్న చెక్క బెంచిపై కూర్చున్నాడు. అలికిడికి తలవంచి బయటకు చూశాడు బడ్డీకొట్టువాడు. "ఆఖరు బస్సు ఇప్పుడే వెళ్లిపోయింది సార్" అన్నాడు వాడే.

వాడు వేలుపెట్టి చూపించిన దిశగా చూశాడు సందీప్, దూరంగా కొండను చుట్టుకుని పడుకున్న పాములాంటి రోడ్డుపై ప్రాకుతూ వెళుతున్న దీపం పురుగులా కనిపించింది బస్సు. మంచు తెరల మాటు నుండి బూజా బూజుగా కనిపిస్తున్న బస్సు వెనుకనున్న ఎర్ర దీపాన్ని చూసి నిట్టూర్చాడు సందీప్.

అతని గుండె చప్పుడు అతడికే స్పష్టంగా వినిపిస్తోంది. నరనరాన భయం ప్రాకి అతన్ని కుదురుగా ఉండనీయటం లేదు. కన్ను మూసినా, తెరిచినా ఇందాకటి దృశ్యమే కనిపించి గుండె ఆగిపోయినంత పనవుతోంది. దయ్యం అన్నమాట

# ఎలకమ్మకీ ఓ గుడి!



చాలామంది తమ ఇళ్లల్లో ఎలుకలతో సహజీవనం చేస్తూంటారు. అవి మరీ మితిమీరి బొత్తిగా భయం, భక్తి అన్నది లేశమైనా లేకుండా సందడిగా తిరుగుతుంటాయి. అంతటితో ఊరుకుంటాయా, ఊహుఁ! తమ కలుగుల దాకా వెళ్లి 'మమ్మల్ని ఏమీ చెయ్యలేరోచ్!' అన్నట్లుగా పళ్లు బయటపెట్టి కిచకిచా వెక్కిరిస్తాయి కూడానూ. వీటి భయానికి రాత్రిపూట ఆ ఇంటి గృహిణి డబ్బా కో గుండ్రాయి చొప్పున పెట్టినా సరే, సంఘీభావంతో వాటిని పడగొట్టి డబ్బాలోని పదార్థాన్ని శుభ్రంగా ఫలహారం చేస్తాయి. రాత్రంతా బడబడ శబ్దాలే అలాంటి వారి ఇళ్లలో. మరికొన్ని ఎలుకలు ఇంట్లోని కొన్ని ప్రదేశాలను తమ హక్కుభుక్తం చేసుకుంటాయి. ఆ గదిలోగానీ ఎవరైనా పడుకున్నారా - వాళ్ల అవస్థ దేవుడికే ఎరుక! మూషిక మాతాపితలు పర్యవేక్షిస్తుండగా మూషిక సంతానం ఆ అభాగ్యుడి[రాలి] బొజ్జ మీద క్రికెట్, ఫుట్‌బాల్ ఇత్యాది క్రీడలు ఆడేస్తాయి. అక్కడికీ నిద్ర లేవని కుంభకర్ణులనైతే చేతి వేళ్లనూ, కాలి వేళ్లనూ ముద్దుపెట్టుకుంటాయి.

ఇంట్లో ఇంత అల్లరీ ఆగం చేస్తున్నా 'సదరు గృహ యజమాని, వారి భార్యామణీ మాత్రం వాటిని పట్టి దూరంగా విడిచిపెట్టడానికి గానీ, కొత్తగా వచ్చిన ఎలుకలను చాక్లెట్లు పెట్టి చంపడానికిగానీ ససేమిరా ఒప్పుకోరు. కారణం ఎలుక బొజ్జ గణపయ్య వాహనం కావడమే! ఆ వెంకయ్యకు అనుగ్రహం తప్పుతుందేమో ననే భయంచేతనే!

మనవాళ్లుఎలుకలను సహించినా, వాటికి గుడికట్టి పూజించలేదు గానీ, రాజస్థాన్‌లోని బికనీర్ దగ్గర ఉన్న 'దేషనోక్' గ్రామంలో అంత పనీ చేశారు. [ఈలెక్కన మనవాళ్లు చాలా బ్యాక్‌వర్డ్ అని చెప్పుకోవాలి.] ఇక్కడ ఎలుక దేవతను 'కార్ని దేవి' అనే పేరుతో కొలుస్తారు. ఈ ఎలుకల గుడికి రాజస్థాన్, సింధ్, కచ్, కథియావార్, మాల్వా గుజరాత్‌లాంటిచోట్ల నుంచి వచ్చి ఈ కార్నిదేవికి తమ కోరికలను విన్నవించుకుంటారు. ఈ దేవికి పాలు, లడ్డూలు, ఇంకా తీపి పదార్థాలూ నైవేద్యంగా పెడతారు.

ఆలయ ప్రాంగణంలో చాలా భాగం ఇనుప తీగతో చేసిన వలను భూమికి కొంత ఎత్తున బిగించారు. వాటికింద తెగబలిసిన మూషిక రాజాలు కనిపిస్తుంటాయి. వీటిని ఏ గద్దలో తన్నుకుపోకుండా ఇలా ఇనుప తీగ వలతో రక్షిస్తున్నారట. ఈ ఎలుకలన్నీ అతి పవిత్ర వాతావరణంలో ఉన్నాయని, ఇవి ఏ జబ్బులనూ వ్యాపింపజేయవనీ, వాటికి ఏ హానీ తలపెట్టరాదనీ రాసిన బోర్డులు దర్శన మిస్తుంటా యక్కడ. ఎవరైనా ఈ ఎలుకలను చంపినట్లయితే దాని వెండి ప్రతిమను కార్ని దేవికి సమర్పించుకోవాలి.

ఈ కార్నిదేవి 'చరణ్' అనే రాజపుత్ర తెగవారి ఇంట పుట్టి, వారిని కాపాడుతానని అభయం ఇచ్చిందట. ఆ ఎడారిలో నీళ్లు ఎక్కడ పడతాయో, పశువులకు మేత ఎక్కడ దొరుకుతుందో చెప్పేదట దేవి. ఓసారి ఈ 'చరణ్'లంతా అకస్మాత్తుగా చనిపోతే, దుర్గామాత మరో రూపమైన కార్నిదేవి శివుడిని ప్రార్థించి వారందరినీ బతికించమని కోరిందట. అయితే అప్పటికే వారి ఆత్మలు ఎలుకల రూపంలో జన్మించాయట. అప్పటినుంచి ఆ ఎలుకలన్నీ కార్నిమాత సంరక్షణలో ఉన్నాయట. కొన్ని ఎలుకలు మరణించాక, తిరిగి 'చరణ్' రాజపుత్రులుగా జన్మించాయట. అలాంటివారే ఈ కార్నిమాతను పూజారులుగా కొలుస్తూంటారు.

అలాంటివారిలో కైలాస్ ఉజ్వల్ అనే వీరభక్తుడు 'భగవతి శ్రీ కార్నిజీ మహారాజ్' అనే పుస్తకం రాశారు. అందులో కార్ని మాత గుడిని 'ఎలుకల గుడి' అని తేలికగా చూస్తున్నారని, ఎగతాళి చేస్తున్నారని కారాలు మిరియాలు నూరారు. కార్నిమాత ఎలుకలకే గాక అన్ని జీవరాసులకు ఆశ్రయం ఇస్తుందని, అతి పవిత్రమైన గుడిపైన కువ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన దుమ్మెత్తిపోశారు. ఆ ఎలుకలన్నీ పవిత్రాత్మలని ఆయన వాక్రుచ్చారు. ఏ గుడిలో ఏ దేవి ఉందో అని నమ్మేవారు నమ్మేయవచ్చు.

మ.ఫీ.

---

వినడమేగానీ, ఇలా ప్రత్యక్షంగా ఎన్నడూ చూసింది లేదు. సహజంగా ధైర్యస్థుడయినా, ఈ క్షణంలో తనే ఇలాగయ్యాడంటే ఇక సామాన్యుల విషయం చెప్పాలా? ఇందాకటి దృశ్యమే మరీ మరీ గుర్తొచ్చి సందీప్ శరీరం వణికిపోతోంది.

చీకటి దొంతరలను తొలగించుకుంటూ, మంచుతెరలను చీల్చుకుంటూ, ఒక్కొక్క అడుగే ముందు కేసుకుంటూ, నింపాదిగా, నిదానంగా, కదుల్తూ... ఎంత భయంకరంగా ఉన్నా యా ప్రాణులు ... అవునూ అవి ప్రాణులేనా? ఏమనాలి వారిని? దెయ్యాలా, ఆత్మలా? అమ్మో! వాటి గురించిన తలపే అతన్ని వణికించేస్తోంది.

సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత నిద్రనుండి లేచినట్టు, ఊబిలో నుండి లేచి, ఒళ్లంతా బురదమయంగా బయటపడి, మళ్లీ మామూలుగా ఏమీ జరగనట్టే.... అసలేమీ జరగనట్టే ఎప్పట్లాగే ఇంటికి వస్తున్నారన్నమాట ఛటర్జీ, అతని మరుదులు. ఇదే ఏ కథలోనో, నవల్లోనో చదివుంటే తనూ నమ్మేవాడు కాదు. కానీ ఇది సత్యం. సరిగ్గా పది నిముషాల క్రితం అతని కండ్ల ముందే జరిగిన సంఘటన అది. దాన్ని అంత తేలిగ్గా మరచిపోలేకపోతున్నాడు సందీప్.

"అన్నూ! ఈ వేళ్టి స్కోరు 100" అన్న కేక వికృతంగా ఇంకా అతని చెవుల్లో గింగురు మంటోంది. వెన్నులోంచి ఏదో జరజరా పాకినట్టయింది.

తల విదిలించాడు. ఈ దెయ్యాల ఊరిని ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వదిలేయాలి. కానీ చూస్తుంటే ఆఖరు బస్సూ పోయిందట, ఎలా ఇప్పు డెలా? తీవ్రంగా మధనపడిపోతున్నాడు సందీప్.

"ఎవరింటి నుంచి వచ్చిం డావప్పా?" బడ్డీ కొట్టువాడు ప్రశ్నించాడు.

ఏం సమాధానమీయలేదు సందీప్.

"ఏమన్నా అరిజెంట్ పని ఒడి బయల్దేరినావా? సర్లే కూకో, ఏదన్నా లారీ వత్తుందేమో చూద్దాం."



(తరువాయి 16వ పేజీ)

(పదవ పేజీ తరువాయి)

వాడే చెప్పాడు మళ్లీ.

ఈ మాటతో ఉత్సాహం వచ్చింది నందీప్‌కు. "అయితే లారీలేమయినా వస్తాయా?"

"సానా వస్తాయని సెప్పలేం. అప్పా డొకటి ఇప్పు డొకటి వస్తుంది, ఎక్కుతావులే ఏదో ఒకటి వస్తుంది."

చాలా రిలీఫ్‌గా అనిపించింది నందీప్‌కు.

పెట్టె నుండి తీసి స్వెట్టరూ, మఫ్లరూ ధరించాడు. అయినా చలి ఆగకపోవటంతో శాలువా తీసి నిండుగా కప్పుకుని ఒదుక్కుని కూర్చున్నాడు.

మనీష, ఆమె అందమయిన రూపం, చక్కటి నడక, తీయని కంఠం, అమాయకమైన చూపులు అన్నీ గుర్తొస్తున్నాయి. పాపం! ఆమె నలా ఒంటరిగా వదిలేసి వచ్చేశాడు తను, ఎలాగుందో. అన లామె చూపుల్లో ఎంత భయం ద్యోతకమయింది, చిగురుటాకులా కంపించిపోయింది పాపం. ఆ దెయ్యాలు ఏం చేశాయో? మనీష ఎలాగుందో? అవునూ, డాక్టర్ అనుపమా ఛటర్జీ ఎలా ఫీలయ్యుంటుంది ఆ దెయ్యాల్ని చూసి. బహుశా ఆనందపడుండవచ్చు. ఎంత పిచ్చిగా నమ్ముతూ వచ్చింది ఆవిడ తప్పకవాళ్లు తిరిగి వస్తారని. చివరికి ఆమె నమ్మకమే నిజమయింది. అయినా ఎంత ఆశ్చర్యంగా జరిగిపోయిం దా సంఘటన.

కాలిబాట వెంబడే నడుచుకుంటూ ఎంత చక్కగా వచ్చారు! నందీప్‌ని భయం ఆవరించింది తిరిగి. షాపు వాడేదో పాట పాడుకుంటున్నాడు.

దూరంగా ఏదో అడుగుల చప్పుడు వినిపించసాగింది. క్రమంగా దగ్గరయింది. తల తిప్పి వెనక్కు చూడలేదు నందీప్. అడుగుల చప్పుడు మరింత దగ్గరయింది. అతని వెనుకే వచ్చి ఆగినట్టయింది. షాపు తాలూకు రేకు అడ్డు ఉండటం వల్ల షాపు వాడికి ఎవరయిందీ కన్పించే అవకాశం లేదు.

నందీప్ భుజంపై చేయివడింది, చాలా బరువుగా ఉం దది. తల తిప్పి, నెమ్మదిగా కంళ్లు పైకెత్తి చూశాడు నందీప్.

గొంతు నుండి రాబోయిన కేక నాలుక సహకరించకపోవటంతో గొంతులోనే సుడులు తిరిగి ఆగిపోయింది. అదే కేక బయటికి వెలువడింటే ఆ కొండలు కోనలు దాటేది, ఆపై నింగిని తాకేది. అంత భయం, ఉద్వేగం ఇమిడి ఉన్నా యందులో.

తన భుజంపై చేయి వేసింది డాక్టర్ అనుపమ భర్త, మనీష పెదనాన్న ఛటర్జీ. మూడు సంవత్సరాల క్రితం ఊబిలో పడి దారుణంగా మరణించిన ఛటర్జీ తాలూకు కుడి అరచేయి ఇప్పుడు తన కుడి భుజంపై ఉంది. బరువుగా ఉన్న ఆ చేయి అతని భుజాన్ని ఒడిసి పట్టుకుని ఉంది. భయంతో కంళ్లు పెద్దవయ్యాయి నందీప్‌కి. "నో... నో... న న్నేం చేయకండి." బలహీనంగా గొణిగాడు.

భావరహితంగా నందీప్‌నే చూస్తున్నాడు ఛటర్జీ!

"నో... నో... నన్ను... న..." మాట తడబడుతోంది నందీప్‌కి.

అప్పుడు నవ్వాడు ఆయన, చిరునవ్వు. అదే క్రమంగా పెద్దదయింది. నవ్వి నవ్వి కంళ్లలో నీరు తిరిగి, అలసట వచ్చి ఆగాడు. అయోమయంగా చూస్తున్నాడు నందీప్.

"మనీష తరవున నేను క్షమార్పణ కోరుతున్నాను. నీవు మా అందర్నీ క్షమించు నందీప్."

నందీప్ ఆయన వంకే చూస్తున్నాడు. చూపుల్లో భయం, ఆందోళన, అయోమయం కనిపించటంలేదు. ఆ స్థానే నిర్వికారత చోటుచేసుకుంది. అయోమయానికి ఇది పరాకాష్ఠ దశ.

"అవును నందీప్! మీరు మమ్మల్ని క్షమించాలి. మనీష తా నో టీ ఎక్స్‌పర్ట్ అని చెప్పుంటుంది. ఆ సంగతలా ఉంచితే, ఆమె ఓ ఎక్స్‌పర్ట్ ప్రాక్టికల్ జోకర్ అని ఒప్పుకొని తీరాలి."

జోక్స్ వేసే వారిని 'జోకర్' అనచ్చా అన్న విషయం ఆలోచించటం లేదు నందీప్ - "ప్రాక్టికల్ జోక్స్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. మే మెవ్వరం చనిపోలేదు - నిక్షేపంగా ఉన్నాం. మాకు పిల్లలు లేకపోవటాన, బంధువుల పిల్లల్నే మా పిల్లలుగా భావించుకుని ఆనందిస్తున్నాం. ఇంత చిన్న ఊర్లో కాలక్షేపం అవదు మొర్రో అని మనీష గోల చేసినా దాన్ని అప్పుడప్పుడు పిలిపించుకోనిదే వాళ్ల పెద్దమ్మకి తోచదు. అది వచ్చిన ప్రతిసారీ ఇలాంటి అల్లరి మామూ లయింది. ఏదో ఒకటి చేసి అల్లరి పుట్టించటం సరదా దానికి. అదొచ్చిన ఈ పది రోజులూ అసలు కాలక్షేపం అవలేదు. అన్నా తమ్ముళ్లిద్దరూ దీన్ని మించిన ఘటాలు కావటాన దీని ఆటలు సాగలేదు. అందుకే అసలూ, వడ్డీ కలిపి ఇవ్వాళ నీపై ప్రతాపం చూపింది. ఏనీవే, నువ్వు క్షమించానంటేగానీ నా మనసు కుదుటపడ దబ్బాయ్!" ఆయన కాసేపాగి తిరిగి చెప్పాడు.

"ఇదిగో ఈ రాక్షసిని కూడా పిల్చుకొచ్చాను. సారీ చెప్తుందట." గోముగా మనీష తలపై మొట్టికాయేశా డాయన.

అప్పుడు చూశాడు మనీషని. అంతవరకూ మిస్టర్ ఛటర్జీ చాటునే వినయంగా నిలబడి ఉంది.

అయామ్ సారీ, నందీప్. ప్లీజ్ క్షమించా ననవూ?"

మనీషనే చూస్తూ చిలిపిగా నవ్వాడు నందీప్.

అంగడి తాలూకు హరికేన్ లాంతర్ కాంతి పడి మనీష ముక్కుపుడక తళుక్కు మంది.

నందీప్ సూట్‌కేసుల్ని తీసుకుని నడక ప్రారంభించాడు ఛటర్జీ. ఆయన వెనుకే చిన్నగా నడవసాగారు మనీష, నందీప్‌లు.

మంచు దూదిపింజల్లా రాల్తూనే ఉంది.

['సాకి'కి కృతజ్ఞతలతో] ●



## 'క్రాస్‌వర్డ్స్' కింగ్

యాక్షన్ హీరో అజయ్ దేవగన్‌కు కేవలం ఫైటింగులు మాత్రమే తెలుసుననుకుంటే పొరపా టుపడ్డా రన్నమాటే! సినిమా రంగంలో ప్రస్తుత మున్న హీరోల కంటే అతనికి తెలివి కాస్త ఎక్కువే! దానికి కారణం కూడా ఉంది. క్రాస్‌వర్డ్స్ పజి ల్స్‌ను జెట్ స్పీడ్‌తో అజయ్ అలవోకగా పూర్తి చేస్తున్నాడు. సాహిత్యంతో కాస్తో కూస్తో పరి చయం లేనిదే ఆ వేగం రాదు కదా! కనుక తనూ తెలివిగల వాడినని అజయ్ నిరూపించుకుం టున్నా డన్నమాట!

మసూద్ అన్సారి

